ఇంకా నిరీక్షణే..!

నామినేషన్లు వేసేందుకు గడువు మరో నాలుగు రోజులే

- మూడు చోట్ల ఖరారు కాని బీజేపీ అభ్యర్థులు
- కాంగ్రెస్ అభ్యర్థులకు అందని బీఫారాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నామినేషన్లు వేసేందుకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువున్నా ఉన్నా విపక్ష పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక...బీ-ఫారాల అందజేతపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. అధికార బీఆర్ఎస్ పార్టీ మాత్రం జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించటంతోపాటు ప్రచార పర్వంలో దూసుకెళుతోంది. ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాలు మినహాయించి, మిగతా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మళ్లీ అభ్యర్థులుగా ప్రకటించటంతో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లటం ద్వారా ఎన్నికల్లో మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే.. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులపై పార్టీలో నెలకొన్న అసమ్మతి తొలగక పోవటంతో కేడర్ అందోళన వ్యక్తం చేస్తోంది.అలాగే, నామినేషన్ పత్రాల దాఖలుకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ విపక్ష పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో భారతీయ జనతా పార్టీ ఐదు అసెంబ్లీ స్థానాలకు గానూ రెండింటిలో మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా మేడ్చల్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి శాసన సభా స్థానాల్లో అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ ఐదు అసెంబ్లీ స్థానాలకు గానూ మొదటి జాబితాలో నాలుగింటిలో అభ్యర్థులను ప్రకటించగా, రెండో జాబితాలో మరో స్థానంలో అభ్యర్థిని ఖరారు చేసింది. అయితే...నామినేషన్ల గడువు దగ్గర పడుతున్నప్పటికీ, అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ బీ-ఫారాలు అందకపోవటంతో కేడర్‌లో అందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 8 వరకు బీ-ఫాం పంపిణీపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

త్వరలో కాంగ్రెస్ పరిశీలకుల నియామకం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అభ్యర్థుల విజయం కోసం ఐదు నియోజకవర్గాలకు త్వరలో ఏఐసీసీ పరిశీలకులను నియమించేందుకు పార్టీ కసరత్తు చేస్తోంది. వీరంతా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల ప్రచారం, విజయం సాధించడానికి అవసరమైన సూచనలు చేస్తారు. జిల్లాలో మేడ్చల్ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు,మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి అనుచరుడైన తోటకూరి వజ్రేష్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా, ఉప్పల్‌లో ఎం.పరమేశ్వర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్‌లో కొలన్ హన్మంతరెడ్డి, కూకట్‌పల్లిలో బండి రమేష్ టికెట్ ఇచ్చారు. వీరంతా ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. బస్తీలు ,వార్డుల వారీగా గ్రూపు సమావేశాల ద్వారా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల వద్దకు తీసుకెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ఖరారు కాని బీజేపీ అభ్యర్థులు..

భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జిల్లాలో ఇప్పటి వరకు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. కుత్బుల్లాపూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఉప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే ఎన్ఎస్ఎస్ ప్రభాకర్‌కు టికెట్ ఇవ్వటంతో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి బీజేపీ పేరుతో ప్రజల వద్దకు వెళ్లుతున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న అభ్యర్థులు తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అలాగే మల్కాజిగిరి, మేడ్చల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థలను ప్రకటించాల్సి ఉంది. సోమవారంనాటికి ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించగలదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చేవారికి మద్దతు

మల్లాపూర్: తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చేవారికి టీయూజేఏసీ మద్దతు ఉంటుందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ అన్నారు. ఆదివారం నాచారంలోని టీయూజేఏసీ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, దళిత సంఘర్షణ సమితి ఉప్పల్ నియోజకవర్గం కమిటీల సంయుక్తాధ్వారంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్నికి ముఖ్య అతిథిగా నల్లా రాధకృష్ణ హాజరై మాట్లాడారు. ఏ పార్టీకి మద్దతు ఇచ్చేంది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

కాలనీ నూతన కమిటీ ఎన్నిక



బోడుప్పల్: శివపురి ఎన్‌క్లేవ్ ఫేస్ 4 నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ముఖ్య సలహాదారులు మంగళపల్లి రమేష్, రవికుమార్, నామా బాబురావు, కాలనీ పెద్దల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. కాలనీ అధ్యక్షులుగా నన్నూట రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కూరెల్ల నరిసింహాచారి ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమాభివృద్ధి



జవహర్‌నగర్‌లో ర్యాలీలో పాల్గొన్న మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి, మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఆదివారం ప్రజా ఆశీర్వాద సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 10వేల మందితో ఫైరింగ్‌రేంజ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి జరిగిందన్నారు. కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, ఉద్యమకారులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌చారి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



అవుషాపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఘట్‌కేసర్: మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ,తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని అవుషాపూర్‌లో ఆ గ్రామ కాంగ్రెస్ శాఖ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో జంగయ్య ముదిరాజ్, సందీప్ రెడ్డి, వామన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సల్మాన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



జవహర్‌నగర్: మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ జవహర్‌నగర్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఇంటింటి ప్రచారం



మేడ్చల్ లో ప్రచారం చేస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి



అత్వెల్లిలో కాంగ్రెస్ నాయకులు



మూడో వార్డులో బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్: ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో మేడ్చల్ లో వివిధ పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం పార్టీ నాయకులు కార్యకర్తలు జోరుగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో, మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కరపత్రాలు అందజేసి తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరుతూ జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు.10 నుండి 20మంది నాయకులు కలిసి వెళ్లి కాలనీలలో ప్రచారం జోరుగా చేస్తున్నారు. బీఆర్ఎస్ తరుపున మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్లు దేవ, నర్సింహ్మాస్వామి యాదవ్, ఉమానాగరాజు, కౌడె మహేష్, కాంగ్రెస్ తరుపున కౌన్సిలర్లు సరిత మల్లేష్‌గౌడ్, నాయకులు జోరుగా ప్రచారం చేశారు. వివిధ గ్రామాలలో కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ కోసం ఆయన కుమారుడు అజయ్ యాదవ్ మండలంలో ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్,బీజెపీ మాటలకు మోసపోవద్దు



ప్రచారంలో పాల్గొన్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: కాంగ్రెస్,బీజెపీ మాటలకు మోసపోవద్దని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మంజులగౌడ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, దశాబ్దాల పాలన చేసిన కాంగ్రెస్ పార్టీ వలన తెలంగాణకు జరిగిన మేలు ఏమిలేదన్నారు. పది సంవత్సరాల్లో వంద సంవత్సరాల అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు.

బీఆర్ఎస్ గెలుపు తథ్యం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె అల్వాల్‌లోని ఎంఈఎస్ కాలనీ, శ్రీనివాసనగర్ కాలనీ తదితర ప్రాంతాలలో మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, డోలీ సుధీర్, సుభాష్, సూర్య ప్రకాష్‌రెడ్డి, ప్రేంకుమార్, నిర్మళరెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టులు పరిశీలించిన అధికారులు



చెక్ పోస్టులను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్ మీన

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్ మీన (ఐఆర్ఎస్)లు ఉప్పల్ ఎన్నికల అధికారులతో కలిసి ఆదివారం ఉప్పల్‌లోని పోలీస్ చెక్ పోస్టులను పరిశీలించారు. వాహన తనిఖీల వివరాలు, పట్టుబడ్డ నగదు, తదితర అంశాలు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు చోట్ల చెక్ పోస్టులను ఇతర అంశాలు పరిశీలించారు. రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో సెక్టోరల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు.

నాలుగు కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠాను చూపిస్తున్న ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు

ఉప్పల్: గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపిన మేరకు.. నాచారం చౌరస్తాలో గంజాయి తరలిస్తున్న సమాచారం అందుకున్న ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం నాచారంలో మాటు వేసి ఉన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన షేక్ ఫిరోజ్(26), తంగెళ్ల గిరీష్(22) ద్విచక్ర వాహనంపై అక్కడికి వచ్చారు. పోలీసులను చూడగానే పారి పోవడానికి ప్రయత్నించగానే అప్రమత్తమైన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల రెండు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సా నుంచి తీసుకు వచ్చి కందుల బాలకృష్ణకు, అదే ప్రాంతానికి చెందిన శ్రీకాంత్(26), తీగల చందు(21)లు విక్రయిస్తామని, వారు చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అధిక ధరలకు విక్రయిస్తారని పోలీసులకు చెప్పారు. దీంతో వారిని కూడా అదుపులోకి తీసుకుని ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాదీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మత్తులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా సోమవారం గౌడవెళ్లి సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చందు తెలిపారు. గౌడవెళ్లి , సాకేత్ విల్లాస్, జ్ఞానాపూర్, బాసిరేగడి గ్రామాల పరిధిలోని అగ్రికల్చరల్,పరిశ్రమల సర్వీసులకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఘనంగా బోనాలు



కీసర: కీసరలో బోనాల వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ ఆలయానికి మహిళలు, భక్తులు పెద్దయెత్తున తరలించ్చారు. డప్పు చప్పుళ్ల, విందు సంబురాలతో కీసరలో పండుగ వాతావరణం విస్పష్టంగా నెలకొంది.

కన్నుల పండువగా బొడ్రాయి పున:ప్రతిష్ఠ



కీసర: కీసరలో నాభిశిల (బొడ్రాయి) పునఃప్రతిష్ఠ మహోత్సవ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో శనివారం నాభిశిల పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ దంపతులు, పన్నాల బుచ్చిరెడ్డి, ఎంపీటీసీసభ్యుడు తటాకం నారాయణ పాల్గొన్నారు.

హైటెక్‌సిటీ 147 రూట్ పునరుద్ధరణ

కాప్రా: టీఎస్ఆర్టీసీ కుషాయిగూడ డిపో పరిధిలోని నడిచే 147 రూట్ బస్సును పునరుద్ధరించినట్లు డిపో మేనేజర్ చంద్రకాంత్ తెలిపారు. ఐటీ ఉద్యోగులతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ నుంచి కొండాపూర్ వరకు రెండు నూతన సర్వీసులను పునరుద్ధరించినట్లు తెలిపారు. హెచ్‌బీకాలనీలో ఉదయం 7.20 గంటలకు బయలుదేరి ఈసీఐఎల్, నేరేడ్‌మెట్, లాల్‌బజార్, ఖార్ఖానా, జేబీఎస్, ప్యారడైజ్, బేగంపేట్, పంజాగుట్ట, ఎల్వీ ప్రసాద్ హస్పిటల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, హైటెక్‌సిటీ, కొత్తగూడ మీదుగా ఉదయం 9 గంటలకు కొండాపూర్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు. హెచ్‌బీకాలనీ నుంచి బయలుదేరు వేళలు ఉ. 7.20, ఉ. 7.30, ఉ. 10.45, ఉ. 11.45, మధ్యాహ్నం 2.50, సాయంత్రం 6.10 గంటలకు, తిరిగి కొండాపూర్ నుంచి ఉ. 9, ఉ. 10, మధ్యాహ్నం 12.45, మ. 1.40, సా. 4.20, సా. 6 గంటలకు బయలుదేరనున్నట్లు తెలిపారు. ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇదే రూట్లో సర్వీసులు పెంచనున్నట్లు తెలిపారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

మల్లాపూర్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎక్స్‌ట్రా మైల్ ఫౌండేషన్ వ్యవస్థపకులు నాగ మోహన్ అన్నారు. స్వయం ఉపాధి కల్పన ప్రాజెక్ట్‌లో భాగంగా మల్లాపూర్‌లో నెల రోజుల పాటు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చారు. దాతలు పద్మ, ఫణేష్ కోనేరు, కోటేశ్వరరావుల సహకారంతో మహిళలకు కుట్టు మీషన్‌లను ఆదివారం అందజేశారు. సబల కేంద్రం హెడ్ నరేంధర్, కో ఆర్డినేటర్ సరిత పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డిని ఓడిస్తాం



కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి చామకూర మల్లారెడ్డి ఓడేది ఖాయమని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఎదులాబాద్ మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన వందలాది నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి ఐదేళ్ల పాలనలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడిందన్నారు. డబ్బు అహంకారంతో విర్రవీగుతున్న మల్లాడ్డికి ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, అమర్, ఉదయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సుస్థిర సుపరిపాలన బీజేపీకే సాధ్యం

ఉప్పల్ బీజేపీ అభ్యర్థి ప్రభాకర్



బీజేపీలో చేరుతున్న దృశ్యం

రామంతాపూర్: పరిధిలోని శ్రీనగర్ కాలనీ పలువురు బీఆర్ఎస్ కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు ఆదివారం బీజేపీ అభ్యర్థి ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిర సుపరిపాలన అందించే సత్తా కేవలం ఒక్క బీజేపీకే ఉందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి తప్ప బీఆర్ఎస్ హయాం లో నియోజకవర్గం పలు రంగాల్లో అ భివృద్ధి కుంటు పడిపోయిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నేతలు జగన్ యాదవ్, వెంకట్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేశా



ఎమ్మెల్యే మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న టీడీపీ నేత సత్యనారాయణ యాదవ్

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలతోపాటు అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేశానని తమపై మల్కాజిగిరి ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం భవానినగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఉదారి సత్యనారాయణ యాదవ్ మైనంపల్లి సమక్షంలో 100 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి బీ-బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, భవానినగర్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన టెలిఫోన్‌కాలనీ రెడ్డి సంఘం

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వంగాల మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లేపల్లి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొక్క రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా పులుగం శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దొడ్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సూదిరెడ్డి ధర్మేందర్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డి, నిమ్మల బాల్‌రెడ్డి, పి. శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షులు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డిల సంక్షేమమే లక్ష్యంగా వారి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

మల్కాజిగిరి బరిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు



ఆర్యవైశ్య సంఘం నాయకులు సమావేశం

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆర్యవైశ్య సంఘం తరుపున బరిలో ఉంటామని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేం గాంధీ అన్నారు. ఆదివారం ఓల్డ్ మల్కాజిగిరిలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో ఆర్యవైశ్యుల రాజకీయ చర్చా వేదిక జరిగింది.ఈ సందర్భంగా పాల్గొన్న సంఘం నాయకులు మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలో సుమారు 33 వేల మంది ఓటర్లు ఉన్నారని ఏ రాజకీయ పార్టీ కూడా ఆర్యవైశ్యులను గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సారి రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పడానికి నేరుగా బరిలో దిగుతున్నామన్నారు. ఏకగ్రీవంగా రాచర్ల శ్రీనివాస్‌ను అభ్యర్థిగా ఎన్నుకున్నామని త్వరలోనే పూర్తి స్థాయి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సంఘం చైర్మన్ అనుటెక్స్ రామక్రిష్ణ, అధ్యక్షుడు ఆకుల సుధాకర్, ట్రస్ట్ అధ్యక్షులు మాదంశెట్టి అశోక్ తదితరులు ఉన్నారు.

మల్లారెడ్డికి మద్దతుగా ప్రచారం



ప్రతాపసింగారంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ శివశంకర్ తదితరలు

ఘట్‌కేసర్: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి చామకూర మల్లారెడ్డిని గెలిపించాలని ప్రతాపసింగారంలో ఆ గ్రామ సర్పంచ్ వంగూరి శివశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు వివరించారు.

బీఆర్ఎస్‌కు శ్రీరాంనగర్ అసోసియేషన్ మద్దతు



కీసర: నాగారం మున్సిపాలిటీలోని 14వ వార్డు పరిధిలో శ్రీరాంనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం సమావేశయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డికే ఓటు వేస్తామని కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం



ప్రజలకు అభివాదం చేస్తున్న చామకూర మల్లారెడ్డి

బోడుప్పల్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి గెలుపు ఖాయమని మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో ఆదివారం నిర్వహించిన బైక్ ర్యాలీ కార్యక్రమానికి కి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.